సాక్షి శ్రీకాకుళం
సోమవారం । 14 । అక్టోబర్ । 2024



కరిగిపోతున్న కొండ

పొందూరులో కంకర మట్టి కొండ కరిగిపోతోంది. యథేచ్ఛగా తవ్వి తీసుకెళ్తున్నారు.

- 8లో



ప్రాణం తీసిన మద్యం బాటిల్

మద్యం బాటిల్ ఓ యువకుడి ప్రాణం తీసింది. ప్యాంటు జేబులో ఉంచుకున్న బాటిల్ గుచ్చుకుని చనిపోయాడు.

- 8లో

నేడు విద్యాసంస్థలు పునఃప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: దసరా సెలవుల అనంతరం సోమవారం విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయి. విజయదశమిని పురస్కరించుకుని పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు అక్టోబర్ 3 నుంచి 13వ తేదీ వరకు ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆదివారంతో దసరా సెలవులు ముగియనుండగా.. సోమవారం పాఠశాలలు, జూనియర్ కళాశాలలతోపాటు ఇతర విద్యాసంస్థలు పునఃప్రారంభం కానున్నాయి.



తీరానికి గుండె కోత

- సముద్ర తీర ప్రాంతాల్లో కలవరపెడుతున్న కోత
- ఆందోళన కలిగిస్తున్న ప్రకృతి విపత్తుల ముప్పు
- ఆక్రమణలు తొలగించాలని కోరుతున్న మత్స్యకారులు



బొంతలకోడూరు పంచాయతీలోని తీరంలో ఉన్న రొయ్యల చెరువు

ఎచ్చెర్ల క్యాంపస్, వజ్రపుకొత్తూరు:

11 మండలాలు.. 284 గ్రామాలు.. 193 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న సముద్ర తీరం జిల్లాకు ఓ మణిహారం.

లక్షలాది మంది ఈ తీరంపై ఆధారపడి బతుకుతున్నారు. కానీ జిల్లా తీరానికి ఓ ముప్పు పొంచి ఉంది. నానాటికీ తీరంలో కోత పెరుగుతుండడం మత్స్యకారులు, తీర ప్రాంత రైతులను తీవ్రంగా ఆందోళనకు గురి చేస్తోంది. విపత్తులు వస్తే తీర ప్రాంత గ్రామాలు నామరూపాల్లేకుండా పోతాయని, తీరం కోతకు గురి కాకుండా కాపాడాలని వారు కోరుతున్నారు.

నిబంధనలు అమలు చేస్తున్నారా..?

తీరంలో సముద్రానికి 500 మీటర్లు సీఆర్‌జెడ్ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. తీర ప్రాంతంలో ఎనిమిది వేల ఎకరాల వరకు చిత్తడి భూమి ఉంది. 12వేల హెక్టార్ల వరకు రొయ్యల చెరువులు ఉన్నాయి. ఈ చెరువులు చాలా వరకు సీఆర్‌జెడ్ పరిధిలో సైతం ఉన్నాయి. 14వేల హెక్టార్లతో సామాజిక అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. అటవీ భూములు కొన్ని చోట్ల ఆక్రమించేస్తున్నారు. ఇక్కడ చెట్లు ఇష్టానుసారం నరికేస్తున్నారు. ఈ అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టిపెడితేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ప్రమాదాల ముప్పు..

తీరం కోతకు గురి కావడం ఓ వైపు ఆందోళనకు గురి చేస్తుంటే.. మడ అడవులు పెంచకపోవడం కూడా మరింత ఆందోళన పరుస్తోంది. మడ అడవులు, తోటలు తగ్గిపోవడం వల్లనే ఏటా తీరం కోతకు గురవుతోంది. ఈ నేపథ్యంలో సీఆర్‌జెడ్‌లో పూర్తి స్థాయిలో ఆక్రమణల తొలగింపు, మడ అడవులు పెంచటం కీలకం కానుంది. మడ అడవుల పెంపకం ఒక్కటే భవిష్యత్‌లో తీరం కోత నుంచి రక్షణ కల్పిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ చెట్ల వేళ్లే తీర ప్రాంత కోతను తగ్గిస్తాయని, తాటి, ఈత, నీలగిరి, సరుగుడు వంటి చెట్లు పెంచితే తీరం కోత నుంచి రక్షణ లభిస్తుందని సూచిస్తున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు..

జిల్లాలో సీఆర్‌జెడ్ పరిధి, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. దీంతో పాటు రొయ్యల చెరువులు అక్రమంగా నిర్వహిస్తున్నారు. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు, బుడగుట్లపాలేం, కుప్పిలి, రణస్థలం మండలం దోనుపేట, కొచ్చెర్ల, కొవ్వాడ, పోలాకి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, సోంపేట, ఇచ్ఛాపురం వంటి మండలాల ప్రాంతాల్లో రొయ్యల చెరువులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించే చర్యలు తీసుకోవటం లేదు. మరో పక్క ఎచ్చెర్ల, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, మందస, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. అక్రమంగా చెట్లు నరికి కొందరు అమ్ముకుంటున్నారు. ఈ విపరీత పరిణామాలకు అడ్డుకట్ట వేయకపోతే తీరానికి నష్టం తప్పదు.

మడ అడవులు పెంచాల్సిందే



సముద్ర తీర ప్రాంత రక్షణ అన్నది మడ అడవుల పెంపకంతోనే సాధ్యం. తుఫాన్లు, విపత్తులు ఎదుర్కొనే చెట్లు తీరంలో పెంచాలి. కోట్లు ఖర్చు చేసి కోత నిర్మూలనకు నిర్మాణాలు చేపట్టినా ప్రయోజనం ఉండదు. చెట్ల పెంపకం తప్ప ప్రత్యామ్నాయం లేదు.

– గురుగుబెల్లి దామోదర్‌రావు, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సివిల్ ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ

చెట్ల వేళ్లే రక్షిస్తాయి



సముద్ర తీరం కోత అన్నది భవిష్యత్‌లో తీర ప్రాంత గ్రామాలకు ముప్పు. గ్రామాలు సైతం అంతరించి పోయే అవకాశం ఉంది. ప్రకృతి విపత్తులు, ఆటు పోట్లు, సముద్రం లోపల భూ కంపాలు వంటివి తీరం స్వరూపాన్ని మార్చేస్తాయి. తీరం కోత నుంచి చెట్లు వేళ్లు మాత్రమే కాపాడుతాయి. విస్తారంగా సీఆర్‌జెడ్ పరిధిలో చెట్లు పెంచాలి. అటవీ శాతం పెరగాలి. మడ అడవుల పెంపకం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు.

– డాక్టర్ ఎ.ఎ.జియరాజ్, జియోసైన్స్ ఫ్యాకల్టీ సభ్యులు



వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేట తీరంలో అడవులు

న్యూస్‌రీల్

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఎస్సీ రాయనున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు మూడు నెలల పాటు శిక్షణ పొందేందుకు ఈ నెల 21 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. http:jnanabhumi.ap.gov.in లో ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ పొందిన తర్వాత రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని సంబంధిత హాల్ టికెట్లు ఈ నెల 22 నుంచి 25వ తేదీలోగా ఆ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు



వాహన పూజ నిర్వహిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం విజయ దశమి పూజలు నిర్వహించారు. వాహన, ఆయుధ పూజలు నిర్వహించారు. పూజల్లో భక్తిశ్రద్ధలతో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, అందరూ సుఖ శాంతులతో ఉండాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకు రావాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రాజశేఖర్, ఎల్.శేషాద్రి నాయుడు, సీఐ టి.ఇమ్మాన్యుయల్ రాజు, ఆర్ఐ నర్సింగరావు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రుల ముగింపు



చందన అలంకరణలో విజయదుర్గ

శ్రీకాకుళం కల్చరల్: దేవీ నవరాత్రులు ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో అమ్మవారిని ఆఖరి అవతారంగా రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించారు. దసరా సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి దర్శించుకున్నారు. ఆలయాల వద్ద నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలకు పూజలు చేశారు. నిత్యం వాడే వాహనాలకు కూడా పూజలు చేయించుకున్నారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న సాందీప్‌శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఆశ్వయుజ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ ఉషా పద్మిని ఛాయా సమేతుడైన సూర్యనారాయణస్వామి ఉత్సవ మూర్తులకు ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణల మధ్య జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ కార్యక్రమాన్ని జరిపించగా రూ.500 చెల్లించిన దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

జీతాల కోసం వినతి

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, వైద్య సిబ్బంది ఆదివారం రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నిమ్మాడలో కలిశారు. గత పన్నెండు నెలలుగా జీతాలు రాక కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నామని, ఆదుకోవాలని కోరారు. అనంతరం రాతపూర్వకంగా వినతి పత్రాన్ని అందించారు. వినతి పత్రం అందించిన వారిలో మనీషా, సంధ్యారాణి, స్వామి, వేణు తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణాలకు లాటరీ నేడు

- శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో డ్రా ప్రక్రియ
- గెజిట్ సీరియల్ ప్రకారం శ్రీకాకుళం నుంచి మొదలు



శ్రీకాకుళం క్రైమ్ : కొత్త మద్యం పాలసీలో భాగంగా జిల్లాలో 158 మద్యం దుకాణాల లైసెన్సు పొందేందుకు నేడు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ లాటరీ తీయనున్నారు. జిల్లావ్యాప్తంగా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో కలిపి మొత్తంగా 4671 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

- దరఖాస్తుదారు జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం పక్కన అంబేడ్కర్ ఆడిటోరియం వద్దకు ఉదయం ఏడు గంటలకు చేరుకోవాలి.
- ఎనిమిది గంటలకు డ్రా ఆరంభమవుతుంది. వచ్చిన వారు తమ వాహనాలను ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి.
- దరఖాస్తుదారు తమ ఎంట్రీ పాసుతో పాటు ఆధార్‌కార్డు లేదా ఇతర ఐడీ ప్రూఫ్ తప్పనిసరిగా తెచ్చుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వాళ్లు ఫామ్ ఎ3 (బి)ని తీసుకురావాలి, ఐడీ ప్రూఫ్ కూడా తప్పనిసరి.
- దరఖాస్తు దారు రాకుంటే అతని తరఫున వచ్చిన వాళ్లు ఎంట్రీపాసుతో పాటు అధీకృత ధ్రువీకరణ పత్రం, అసలు దరఖాస్తుదారు ఆధార్‌కార్డు తెచ్చుకోవాలి.
- అంతేకాక తమ ఆధార్‌కార్డుపై అసలు దరఖాస్తు దారుని సెల్ఫ్ అటెస్టెడ్ (సంతకం) తప్పనిసరి. ఆన్‌లైన్ దరఖాస్తుకు కూడా ఇదే వర్తిస్తుంది.
- ఎంట్రీపాసుతో వచ్చిన దరఖాస్తుదారునికే లోపలికి వచ్చేందుకు అనుమతి. ఇతరులకు ప్రవేశం ఉండదు.
- స్టేషన్ల వారీగా (గెజిట్ సీరియల్ వారీగా) డ్రా తీస్తారు.
- ఈ లెక్కన శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లోని 1 నుంచి 14 సీరియల్ నంబర్ల షాపులకు, తర్వాత శ్రీకాకుళం స్టేషన్ పరిధి 15 నుంచి 32 వరకు డ్రా తీస్తారు. అనంతరం ఆమదాలవలస, రణస్థలం, పొందూరు, నరసన్నపేట, కొత్తూరు, పాతపట్నం, టెక్కలి, కోటబొమ్మాళి, పలాస, సోంపేట ఉంటాయి. చివరికి ఇచ్ఛాపురం ఎనిమిది షాపులతో డ్రా ముగుస్తుంది.
- డ్రాలో గెలుపొందిన దరఖాస్తుదారు కన్‌ఫర్మేషన్ రిజిస్టర్‌లో సంతకం చేసి 1/6వ వంతు లైసెన్సు ఫీజు పేమెంటు చెల్లించాలి. తక్షణమే ప్రొవిజనల్ లైసెన్సు పొందవచ్చు.
- డ్రాలో గెలుపొందిన దరఖాస్తుదారు అమౌంట్ పే చేయకపోతే ఫస్ట్ రిజర్వ్, సెకెండ్ రిజర్వ్ క్యాండెట్స్‌ను కూడా సిద్ధంగా ఉంచుతారు. వీరిలో ఎవరికో ఒకరికి అవకాశం దక్కుతుంది.

● కాంప్లెక్స్ కళకళ

శ్రీకాకుళం ఏపీఎస్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం ప్రయాణికులతో కళకళలాడింది. దసరా సందర్భంగా దూరప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు తిరుగు ప్రయాణం కావడంతో కాంప్లెక్స్ కిటకిటలాడింది. సోమవారం నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు తెరచుకోనుండడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు విశాఖపట్టణం నాన్‌స్టాప్ బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం సాయంత్రం నుంచి మొదలైన ఈ రద్దీ సోమ, మంగళవారాలలో కూడా ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

– శ్రీకాకుళం అర్బన్



బస్సులోని సీట్ల కోసం బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

ఆర్భాటమే తప్ప ఆచరణ ఏదీ.?

- ఇచ్చిన మాట తప్పడం చంద్రబాబుకు అలవాటే
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

గార: వంద రోజుల పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప పథకాలు తీసుకువచ్చే ఆచరణ కనిపించటం లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలపై మాట తప్పడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటేనని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఉంచిన డబ్బులనే ఇప్పటివరకు ఖర్చు చేశారన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజు నుంచే దాడులు ప్రారంభించి, ఇప్పటివరకు దాడులు చేస్తూనే ఉన్నారని తెలిపారు. కార్యకర్తలకు అండగా నిలబడతామని, ప్రజల కోసం పోరాడతామన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమర్థత, నాయకత్వంపై ప్రజలకు నమ్మకం ఉందని, పార్టీకి 40 శాతం ఓటు బ్యాంకు ఉందన్నారు. కూటమి నాయకుల్లా అబద్ధపు హామీలు ఇవ్వకపోయామని, మేనిఫెస్టోను కచ్చితంగా అమలు చేసి ఆచరణలో చూపించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. జగన్‌కు, చంద్రబాబుకు తేడాను ప్రజలు వంద రోజుల్లోనే గమనించారన్నారు. పదవీ కాంక్ష, ఏదో ఆశపడి కొందరు నాయకులు వెళ్లినంత మాత్రాన పార్టీకి నష్టమేమీలేదన్నారు. ఆయనతో పాటు నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళీ, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మార్పు ధర్మారావు, సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్, మళ్ల నారాయణమూర్తి, మార్పు మన్మధ, పద్మలోచన, జానకీరాం తదితరులు పాల్గొన్నారు.


● ఎన్నెన్నో అందాలు..



ఆకాశంలో లేజర్ షో వేసినట్టు ఆదిత్యుడు అరుణారుణ కిరణాలతో ఆదివారం కనువిందు చేశాడు. మబ్బు చాటు నుంచి జరిగిన ఈ అరుణ కిరణ విన్యాసాన్ని చూసి చూపరులు అబ్బురపడ్డారు.

- ఎచ్చెర్ల, రణస్థలం

ఉపకారం పోయి.. అపకారం చేస్తున్నారు



- పేద విద్యార్థులపై ఫీజుల పిడుగు
- రీయింబర్స్‌మెంట్‌తో చదివే పిల్లలకు గడ్డు పరిస్థితి
- ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని కూటమి ప్రభుత్వం

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యార్థులకు ఉపకారం ఇచ్చి ప్రోత్సహించే రోజులు పోయి.. సాయం చేయక అపకారం చేసే రోజులు వచ్చాయి. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ వైఖరి ఆందోళనకు గురి చేస్తోంది. ఈ ఏడాది విద్యార్థులకు అందజేయాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల చెల్లింపులపై సర్కారు ఇంకా ఏ నిర్ణయం తీసుకోకపోవడం పేద విద్యార్థులను కలవరపరుస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెప్పిన సమయానికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు, ఉపకార వేతనాలు అందజేసేది. దీంతో పేదల చదువులు ఎలాంటి అడ్డంకులు లేకుండా సాగిపోయేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై కనీస కసరత్తు చేసిన దాఖలా కూడా కనిపించడం లేదు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

ఈ ఏడాది ఇప్పటికే ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ ప్రవేశాలు అయ్యాయి. గతంలో చేరిన విద్యార్థులు పైతరగతులకు వెళ్లారు. ఇలాంటి వారు జిల్లాలో 60వేల మంది వరకు ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవంతో చాలా మందికి కాలేజీల్లో సర్టిఫికెట్లు ఇవ్వలేదు. దీంతో వారు అప్పు చేసి ఫీజులు క్లియర్ చేసి సర్టిఫికెట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గతంలో ఇలా..

వైఎస్సార్‌సీపీ హయాంలో ముందుగా నిర్ణయించిన క్యాలెండర్ ప్రకారం అమ్మ ఒడి నుంచి జగనన్న వసతి, విద్యా దీవెనలు అందజేసేవారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లోనే డబ్బులు జమయ్యేవి. దీంతో వారు ఫీజులు కట్టుకునేవారు. జిల్లాలో ఏటా కనీసం 64,623 మంది పేద విద్యార్థులకు వసతి, విద్యా దీవెన అందేది. గత ప్రభుత్వం హయాంలో స్కాలర్ షిప్పుల పేరిట రూ.163.02 కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో రూ.388.28 కోట్లు విద్యార్థులకు అందజేశారు. విదేశీ విద్యాదీవెనకు సైతం ఐదుగురు విద్యార్థులకు రూ.67.80 లక్షలు చెల్లించారు. ఇంజినీరింగ్, మెడికల్, పీజీ ప్రైవేటు కాలేజీలు అధిక ఫీజులు వసూలు చేయకుండా నియంత్రించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పద్ధతులన్నీ మారిపోయాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బంది తప్పడం లేదు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి



ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. విద్యార్థుల చదువుకు ఇబ్బంది లేకుండా చూడాలి. చదువు పూర్తయ్యి, ఫీజు చెల్లించలేక, కళాశాలల నుంచి సర్టిఫికెట్లు పొందలేక చాలా మంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వారి సమస్యను దృష్టిలో పెట్టుకుని ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయాలి.

– హరీష్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

తమ్మినేనికి ఎమ్మెల్సీ 'వరుదు' అభినందనలు



తమ్మినేనికి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

ఆమదాలవలస: వైఎస్సార్‌ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన మాజీ స్పీకర్‌ తమ్మినేని సీతారాంను ఎమ్మెల్సీ వరుదు కల్యాణి శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. తమ్మినేనిని దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రస్తుత జిల్లా రాజకీయ పరిస్థితులపై ఇరువురు కాసేపు చర్చించుకున్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి నృత్య పోటీలు



నిర్వాహకుల చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విజేతలు

కాశీబుగ్గ: దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మందస మండలం అంబుగాంలో ఆదివారం జిల్లాస్థాయి నృత్య పోటీలు భవన నిర్మాణ కార్మిక సంఘం, జైభవానీ మోటార్‌ యూనియర్‌ సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా డాక్టర్‌ కుమార్‌ నాయక్‌ కేకే సుమన్‌, మాస్టర్‌ రుషి, వ్యవహరించారు. గ్రూప్‌, డ్యూయెట్‌, సోలో మూడు విభాగాలుగా పోటీలు సాగాయి. గ్రూప్‌ విభాగంలో కాశీమాత సోంపేట ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా, ఆర్డీఎక్స్‌ పలాస, హరిపురం వారు ద్వితీయ,తృతీయ బహుమతులు అందుకున్నారు. డ్యూయెట్‌ విభాగంలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కోటబొమ్మాళి, సోంపేట, హరిపురానికి చెందిన డ్యాన్సర్లకు దక్కాయి. సోలో విభాగంలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గీతిక, రాక్‌ స్టార్‌ చిరు, వేణురాయల్‌కు దక్కాయి.

రాష్ట్రస్థాయి క్విజ్‌ విజేత లండారిపుట్టుగ



క్విజ్‌ విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

ఇచ్ఛాపురం రూరల్‌: బూర్జపాడులో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్‌ పోటీల్లో లండారిపుట్టుగ జట్టు విజేతగా నిలిచింది. సరస్వతీదేవి పంచమరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఉద్యోగ సంఘం ఈ పోటీలను నిర్వహించింది. వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయనగరం జిల్లా నెల్లిమర్ల, శ్రీకాకుళం జిల్లా పూండి జట్లు నిలిచాయి. విజేతలకు ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, వైస్‌ ఎంపీపీ దున్న గురుమూర్తి, నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు దాసరి రాజులు బహుమతులు అందజేశారు. శమళ్ల రాజబాబు, బాలక శ్రీనివాస్‌, పూడి నీలాచలం, భూషణంలు క్విజ్‌ మాస్టార్లుగా వ్యవహరించారు.

సామాజిక ఆస్పత్రి తనిఖీ



కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో హాజరు పట్టికను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ కృష్ణమూర్తి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిని శనివారం టెక్కలి ఆర్డీఓ ఎస్‌.కృష్ణమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దసరా రోజున వైద్యసిబ్బంది విధులకు హాజరుకాలేదని ఆస్పత్రికి వచ్చిన పేషెంట్‌ ఆర్డీఓకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆస్పత్రికి వచ్చి తనిఖీ చేశారు. ఇద్దరు డాక్టర్లు విధుల్లో ఉండాల్సి ఉండగా ఒక్క డాక్టర్‌ మాత్రమే వచ్చారు. ఫార్మసిస్టు, ల్యాబ్‌ టెక్నీషియన్‌, ఆరోగ్య మిత్ర విధుల్లో లేకపోవడంతో ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరు కాని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డీసీహెచ్‌ఓకు సిఫార్సు చేశారు. వారం రోజుల్లో మళ్లీ తనిఖీ చేస్తానని చెప్పారు.

MAHARAJAH'S COLLEGE (AUTONOMOUS)
Affiliated to Andhra University, Accredited by NAAC with 'B' GRADE Vizianagaram
ADMISSIONS INTO CATEGORY -B (Management Quota) Seats AY 2024-25 In Under Graduate Program
Interested and eligible candidates may apply for Admission under Category B Seats of all the Majors of B.Sc (Honors), B.Com (Honors), and B.A(Honors) These seats will be filled as per the guidelines of the competent authority.
The application forms may be had from the office of the college from 05/10/2024. For further details, please visit college website. www.mracollegevzm.com or contact 9494208094/ 8008264540.
Last date for the receipt of filled in application is 17/10/2024.
PRINCIPAL CORRESPONDENT

కరిగిపోతున్న కొండ

- టీడీపీ నాయకుల అండదండలతో యథేచ్ఛగా కంకర మట్టి తరలింపు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- గతంలో ఇదే ప్రాంతంలో ఎర్రమట్టి తరలింపు సమయంలో మృతి చెందిన విద్యార్థి



తరిగిపోతున్న ఎర్రకంకర మట్టి కొండ

పొందూరు: కంకర మట్టి కొండలు కరిగిపోతున్నాయి. లోలుగు గ్రామానికి చెందిన వ్యక్తి యథేచ్ఛగా కంకరమట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా తరలిస్తూ రూ.కోట్లు కూడబెడుతున్నారు. కూటమి అధికారం చేపట్టిన నాలుగు నెలల్లో దాదాపు రూ.4కోట్ల వ్యాపారం జరిగింది. రెవెన్యూ, గనుల శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో వీరి ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. మండలంలోని కృష్ణాపురం-రెడ్డిపేట రహదారిలో వీఆర్‌ గూడెం రెవెన్యూ పరిధిలో వందల ఎకరాల్లో ఎర్ర కంకర మట్టి కొండలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం ఈ కొండలు తరిగిపోతున్నాయి. చదునైన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. ఓ టీడీపీ నాయకుడి కనుసన్నల్లో తరలింపు జరుగుతోంది. కొత్త ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడిచింది. దీంతో లోలుగు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రాత్రి, పగలు తేడా లేకుండా కొండను జేసీబీలతో తవ్వించి మట్టిని తరలిస్తున్నారు. కొండను దొలిచే క్రమంలో కొండపై మొక్కలను తొలగిస్తున్నారు. దీంతో పర్యావరణం దెబ్బతింటోంది. కొండను దొలిచేసి ఏకంగా రహదారిని ఏర్పాటు చేశారు. ట్రాక్టర్లు, లారీల రాకపోకలకు అనుకూలంగా మార్చుకున్నారు. పూర్తిగా కొండను చదును చేస్తున్నారేమో అన్నట్లు ఎర్రకంకర మట్టిని తవ్వేస్తున్నారు. గ్రావెల్‌ రోడ్లు వేసేందుకు, రియల్‌ ఎస్టేట్‌ స్థలాలకు, పంట భూములను ఎత్తుగా చేసి ఇళ్ల స్థలాలుగా మార్చేందుకు మట్టిని తరలిస్తున్నారు. పొందూరుకు చెందిన ఓ వ్యాపార వేత్త స్థలానికి వారం రోజుల్లో సుమారు రూ. 60 లక్షల మట్టిని తరలించారు. ఇటు శ్రీకాకుళానికి సైతం మట్టి తరలిపోతోంది. ఈ వ్యవహారమంతా రెవెన్యూ, పోలీసు, గనులశాఖ అధికారులకు తెలిసినా కనీసం అటు వైపు చూసిన పాపాన పోవటం లేదు. ఇప్పటికే పదుల సంఖ్యలో ఎకరాల్లో కొండ తరిగిపోయింది.

గతంలో విద్యార్థి మృతి

గతంలో ఇదే ప్రాంతంలో ఎర్ర కంకరమట్టిని తరలిస్తున్నప్పు అక్కడ పనిచేస్తున్న ఓ విద్యార్థి మృతి చెందాడు. లారీ ఆ విద్యార్థిపై నుంచి వెళ్లపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై అప్పట్లో సీబీఐ విచారణకు మాజీ స్పీకర్‌ తమ్మినేని సీతారాం కోరారు. ఇంత జరిగినప్పటికీ అక్కడ రెవెన్యూ, పోలీసు యంత్రాంగం రెక్కీ పెట్టలేదు దీనిపై తహసీల్దార్‌ ఆర్‌.వెంకటేష్‌(ఎఫ్‌ఏసీ)ను వివరణ కోరగా ఎర్ర మట్టి, కంకర మట్టి తవ్వేందుకు ఎలాంటి అనుమతులు లేవని చెప్పారు. వాటి తవ్వకాలకు సంబంధించి మైనింగ్‌ అనుమతులు ఉండాలని స్పష్టం చేశారు. ఆర్‌ఐ, వీఆర్‌ఓలను తవ్వకాలు ప్రాంతాలకు పంపించి విచారణ జరిపిస్తానని, తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

అదరగొడుతున్న సిక్కోలు క్రికెటర్లు



నంబళ్ల సుశాంత్‌



రాజాన జున్నారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్రాష్ట్ర అండర్‌-19 పురుషుల వన్డే క్రికెట్‌ వినూమన్కడ్‌ ట్రోఫీ (యూత్‌ లిస్ట్‌-ఏ మ్యాచ్‌లు) క్రికెట్‌ టోర్నీలో శ్రీకాకుళం జిల్లా స్టార్‌ క్రికెటర్లు నంబళ్ల సుశాంత్‌, రాజాన జున్నారావు సత్తా చాటుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌ (ఏసీఏ) జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. సెలెక్టర్ల దృష్టిని విశేషంగా ఆకట్టుకుంటున్నారు. బీసీసీఐ ఆధ్వర్యంలో మొహాలిలోని ఐఎస్‌ బింద్రా క్రికెట్‌ స్టేడియం పీసీఏ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా ఈనెల 12వ తేదీన హిమాచల్‌ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏసీఏ 25 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌ చేపట్టిన ఆంధ్రా జట్టు 40.5 ఓవర్లలో 188 పరుగులు చేసింది. జట్టులో వన్‌డౌన్‌ బ్యాటర్‌గా బరిలోకి దిగిన నంబళ్ల సుశాంత్‌ 55 బంతుల్లో 4 బౌండరీలు, ఒక సిక్సర్‌ సాయంతో 31 పరుగులు చేసి రెండో టాప్‌ స్కోరర్‌గా నిలిచాడు. వరుణ్‌సాత్విక్‌ 59 పరుగులతో టాప్‌ స్కోరర్‌గా నిలిచాడు. ఇక రాజాన జున్నారావు పది ఓవర్లు బౌలింగ్‌ చేసి కేవలం 41 పరుగులిచ్చి 5 కీలక వికెట్లు పడగొట్టడం విశేషం.

రామారావు సేవలు చిరస్మరణీయం



రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంద కృష్ణమాదిగ

కంచిలి: ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంబాన రామారావు మాదిగ రిజర్వేషన్‌ పోరాట కమిటీ సాధన కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కంచిలిలో గొల్లకంచిలి ఎస్సీ కాలనీలో ఆయన నివాసానికి కృష్ణమాదిగ ఆదివారం సాయంత్రం వచ్చి రామారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభలో మాట్లాడారు. రామారావు మాదిగ రిజర్వేషన్‌ కోసం తనతో కలిసి చాలా పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. రామారావు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు



గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలకు గురై చికిత్స పొందుతున్న తావడ్‌ సింగ్‌

టెక్కలి రూరల్‌: టెక్కలి మండలం పరిధిలో శనివారం జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

- స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గున్న అప్పన్న అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కోటబొమ్మాళి నుంచి టెక్కలి వైపు ద్విచక్రవాహనంపై గున్న అప్పన్న అనే వ్యక్తి వస్తూ స్థానిక డిగ్రీ కళాశాల వద్ద మలుపు తిరుగుతూ అదుపు తప్పి పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ అప్పన్న కాలుపై నుంచి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.
- టెక్కలి నుంచి బన్నువాడ వెళ్లే మార్గంలో ఓ ప్రైవేట్‌ డిగ్రీ కళాశాల సమీపంలో శనివారం ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. నంబాలపేట గ్రామానికి చెందిన పి.రామకృష్ణ అతని భార్య దీపిక తన పాపతో కలిసి తన గ్రామం నుంచి టెక్కలి వైపు స్కూటీపై వస్తుండగా.. మోదుగవలస గ్రామానికి చెందిన ఓ యువకుడు తన ద్విచక్రవాహనంపై టెక్కలి నుంచి తన గ్రామం వైపు వెళ్తూ మోదుగవలస సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ప్రమాదంలో స్కూటీపై ఉన్న పాప కొంత దూరం తుళ్లిపోగా భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్‌ చేశారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- మండలంలోని లింగాలవలస గ్రామం సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సతివాడ గ్రామం సమీపంలో గల క్వారీలో పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన క్రాంతి లాల్‌, తావడ్‌సింగ్‌ అనే ఇద్దరు వ్యక్తులు శనివారం లింగాలవలస గ్రామం సమీపంలో మద్యం తాగేందుకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వారు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ రోడ్డు ప్రమాదాలకు సంబంధించి టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌ దుర్మరణం



చంటి (ఫైల్‌)

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని కేశవరాయునిపాలెం గ్రామానికి చెందిన నాయని చంటి (26) అనే యువకుడు శనివా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కేశవరాయునిపాలెం గ్రామానికి చెందిన ఈయన ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మురపాక గ్రామానికి బైక్‌ మీద వస్తుండగా హనుమయ్యపేట సమీపంలో వేరే బైక్‌ ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. చంటికి వివాహమై ఏడాదిన్నర కావస్తోంది. ప్రస్తుతం అతని భార్య గర్భిణి. భర్త మృతి వార్త విని ఆమె గడ్డి మందు తాగేయడంతో రిమ్స్‌కు తరలించారు. లావేరు ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

సారవకోట: మండల కేంద్రంలో శనివారం జరిగిన దాడి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనిల్‌ కుమార్‌ తెలిపారు. సారవకోటకు చెందిన తెల్లి వెంకటేష్‌పై అదే గ్రామానికి చెందిన తెల్లి తిరుపతిరావు, రామచంద్రరావులతో పాటు మరో ఐదుగురు దాడి చేసి గాయపర్చినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. బాత్‌రూం తలుపు విషయంలో జరిగిన ఘర్షణలో వెంకటే ష్‌పై దాడి జరిగినట్లు ఆయన తెలిపారు.

వ్యవసాయ మోటార్‌ చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్‌: ఫరీదుపేట గ్రామానికి చెందిన సూర వేణుకు చెందిన వ్యవసాయ మోటార్‌ చోరీకి గురైంది. కింతలిమిల్లు సమీపంలోని రేవళ్ల వద్ద ఉన్న షెడ్‌ తలుపులు శనివారం పగలగొట్టి చోరీ చేశారు. వ్యవసాయానికి నీరు పెట్టేందుకు ఆదివారం ఉదయం వెళ్లగా మోటార్‌ తొలగించి ఉంది. కేశవరావుపేట, లక్ష్ముడిపేట, ఫరీదుపేట ప్రాంతాల్లో ప్రస్తుతం వ్యవసాయ మోటార్లు, మోటార్ల కాయిల్లు దొంగతనం చేస్తున్నారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెరువులో జారిపడి బాలుడు మృతి



మద్ది త్రినాథ్‌

కంచిలి: మండలంలోని కొత్తంపురం గ్రామంలో విజయ దశమి రోజు శనివారం అదే గ్రామానికి చెందిన పన్నెండేళ్ల బాలుడు మద్ది త్రినాథ్‌ గ్రామంలోని కొత్త చెరువులో ప్రమాదవశాత్తూ జారి పడి మృతి చెందాడు. పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం.. త్రినాథ్‌ తండ్రి నీలయ్య తన ట్రాక్టర్‌ను శుభ్రం చేసేందుకు ఉదయం 7 గంటలకు కొడుకుతో కలిసి చెరువుకు వెళ్లారు. కుమారుడు త్రినాథ్‌ చెరువులో దిగి బకెట్‌తో నీళ్లు తీసుకొస్తుంటే తండ్రి గట్టు మీద ట్రాక్టర్‌ను శుభ్రం చేస్తున్నాడు. 7.30 గంటల సమయంలో ప్రమాదవశాత్తూ త్రినాథ్‌ చెరువులోకి జారిపడి నీళ్లలో మునిగిపోయాడు. దీంతో అక్కడ ఉన్న మిగతా పిల్లలు కేకలు వేయగా, ఆ కేకలు విని తండ్రి త్రినాథ్‌, అక్కడ ఉన్న మిగతా గ్రామస్తులు చెరువులోకి దిగి వెతకగా, అప్పటికే త్రినాథ్‌ అపస్మారకస్థితికి వెళ్లిపోయాడు. వెంటనే సోంపేట సీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. బాలుడు మఠం సరియాపల్లి మోడల్‌స్కూల్‌లో ఏడో తరగతి చదువుతుండగా, సోదరి గోపిక 9వ తరగతి చదువుతోంది. తల్లి జయలక్ష్మి గృహిణి. కుమారుడు ప్రమాదవశాత్తూ మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుని తండ్రి నీలయ్య శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ జి.రాజేష్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన మద్యం బాటిల్‌



మృతుడు సవర సురేష్‌ (ఫైల్‌)

మెళియాపుట్టి: మద్యం బాటిల్‌ యువకుని ప్రాణం తీసిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని సవర మురికింటి భద్ర గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మర్రిపాడు కె.పంచాయతీ పరిధిలోని సవర మురికింటి భద్ర గ్రామానికి చెందిన సవర సురేష్‌ (28) శుక్రవారం సాయంత్రం మద్యం సేవించడానికి భరణికోట గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఒక విస్కీ బాటిల్‌ను ప్యాంట్‌లో పెట్టుకుని ద్విచక్రవాహనంపై వస్తుండగా.. బంజీరు గ్రామ సమీపంలో అదుపు తప్పి పడిపోయాడు. ప్యాంట్‌లో ఉన్న మద్యం సీసా పొట్టలో గుచ్చుకుపోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. రాత్రి సమయంలో అటుగా వెళ్తున్న ఓ వ్యాపారి గుర్తించి యువకుడి ఫొటో తీసి గ్రామస్తులకు పంపించడంతో కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని 108 కి సమాచారం అందించారు. సిబ్బంది చూసి మృతి చెందినట్లు ధ్రువీకరించడంతో యువకుని తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. శనివారం కేసు నమోదు చేసి పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. యువకుడికి ఇంకా వివాహం కాలేదు.

వివాహిత ఆత్మహత్య



పులి అరుణకుమారి (ఫైల్‌)

కంచిలి: మండలంలోని పద్మతుల గ్రామానికి చెందిన వివాహిత పులి అరుణకుమారి(30) భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు చెప్పిన వివరాలు ప్రకారం.. ఈ నెల 11వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో అరుణకుమారి, ఆమె భర్త లక్ష్మీనారాయణ గొడవపడ్డారు. ఈ గొడవ అనంతరం ఆమె పెరటికి వెళ్లి ఒంటిమీద డీజిల్‌ పోసుకొని నిప్పంటించుకున్నారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బరంపురం మెడికల్‌ ఆసుపత్రికి రిఫర్‌ చేశారు. బరంపురం తరలిస్తుండగా దారిలో మృతి చెందారు. మృతురాలికి భర్తతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి భర్త ఎస్‌.హెచ్‌. మెయింటెనెన్స్‌ పనుల్లో క్రేన్‌ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. దీనిపై సోంపేట సీఐ బి.మంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్‌ ఎన్‌. రమేష్‌కుమార్‌ పంచనామా రిపోర్టు నమోదు చేశారు.

కుమార్తె పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్తూ..



మోహనరావు (ఫైల్‌)

టెక్కలి రూరల్‌: కుమార్తె పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్తున్న తండ్రిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని శ్యామసుందరాపురం గ్రామానికి చెందిన రుంకు మోహన రావు(52) తన కుమార్తెకు ఈ నెల 20న వివాహం చేసేందుకు ముహూర్తం నిర్ణయించారు. పెళ్లి కార్డులు పంచేందుకు మోహనరావు ఆదివారం తన సైకిల్‌పై జాతీయరహదారి పక్కగా విక్రంపురం గ్రామానికి బయల్దేరారు. రోడ్డుకు అవతి వైపు ఉన్న విక్రంపురం(చింతపాడు) గ్రామానికి వెళ్లేందుకు డివైడర్‌ దాటుతుండగా శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెలుతున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో మోహనరావు తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహిస్తుండగా ఆయన చనిపోయాడని వైద్యులు తెలిపారు. విషయం తెలియడంతో మృతుడి కుటుంబంతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై టెక్కలి ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో ఇద్దరు గంజాయి నిందితులు

సాక్షి టాస్క్‌ఫోర్స్‌: పాతపట్నం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఇటీవల ఒడిశాకు చెందిన బస్సు పాతపట్నంకు వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. బస్సులో 17 కేజీల గంజాయితో తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. అయితే పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. సోమవారం వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నేడే పైడితల్లి తొలేళ్ల ఉత్సవం

విజయనగరం టౌన్‌:

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి తొలేళ్ల ఉత్సవానికి సర్వం సిద్ధమైంది. తల్లి చల్లని ఆశీస్సుల కోసం భక్తులు ఎదురు చూస్తుంటారు. అమ్మవారి అనుగ్రహంతో వచ్చిన విత్తనాలను వేసి నాగలి(ఏరు)తో తొలిత దున్నాలి. దానినే తొలి ఏరు అని... తొలేళ్లని పిలుస్తారు. సిరిమానోత్సవానికి ముందు రోజు ఈ పండగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. తొలేళ్ల రోజు రాత్రి చదురుగుడి నుంచి అమ్మవారి ఘటాలను కోటలోకి తీసుకువెళ్తారు. అక్కడ కోటకి పూజలు చేసి, అమ్మవారి ఆశీర్వచనం పొందిన విత్తనాలను బస్తాలతో ఉంచుతారు. సిరిమాను పూజారి బంటు పల్లి వెంకటరావు చేతులతో ఆ విత్తనాలను అందించి అమ్మవారు ఆశీర్వదిస్తారు. ఆ విత్తనాలను తీసుకున్న రైతులు తమ విత్తనాల బస్తాలలో కలిపి పొలాల్లో చల్లుతారు.

అందరికీ అమ్మ దర్శనభాగ్యం కలిగేలా..

భక్తులందరికీ అమ్మవారి దర్శన భాగ్యం కలిగే విధంగా ఈ ఏడాది క్యూలైన్లను వివిధ విభాగాలుగా చేశారు. ఆలయానికి ఇరువైపులా దివ్యాంగులకు, వయోవృద్ధులకు, ఘటాలకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఎటువంటి టికెట్లు లేకుండా అన్నీ ఉచిత దర్శనాలను కల్పించి అమ్మ దర్శనానికి అవకాశం పూర్తిగా కల్పించారు. తొలేళ్ల రోజు సోమవారం ఉదయం నుంచి సిరిమానోత్సవం రోజున మంగళవారం ఉదయం 6 గంటల వరకూ అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. వివిధ రకాల పుష్పజాతులతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేసే పనిలో కొందరుంటే ప్రసాదాల తయారీలో మరికొందరు ఇలా తలా బాధ్యత అమ్మవారి సేవలో నిమగ్నమయ్యారు. చల్లని తల్లి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు, అధికారులు, నాయకులు సన్నద్ధమయ్యారు.



తొలేళ్ల రోజు ప్రధాన ఘట్టాలు

- వేకువజామున మూడు గంటల నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేస్తారు.
- ఉదయం 8.30 గంటలకు రాజవంశీకులు, మంత్రులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు.
- రాత్రి 10.30 గంటలకు భాజా భజంత్రీలతో అమ్మవారి ఘటాలకు పూజలు చేసేందుకు కోటలోకి పూజారులు వెళ్తారు. కోటశక్తికి, అమ్మవారి ఘటాలకు పూజాధికాలు చేస్తారు.
- ఘటాలను తిరిగి చదురుగుడి వద్దకు తీసుకువచ్చి గుడి ఎదురు బడ్డీలా చేసిన చిన్న బల్లపైన వాటిని ఉంచుతారు. అమ్మవారి దర్శనానికి అవకాశం లేని వారందరూ అక్కడే పసుపు, కుంకుమలను సమర్పించి, మొక్కులు చెల్లిస్తారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో ఆదివారం గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం రైల్వేస్టేషన్‌కు వచ్చిన యువకుడు రైలు కోసం ఎదురుచూస్తూ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించి గాయాలతో బయటపడ్డాడు. అతడిని చూసిన జీఆర్పీ పోలీసులు, స్థానికులు వారించే ప్రయత్నం చేసే లోపే మరోసారి రైలు కింద పడిపోవడంతో చనిపోయాడు. ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమై వచ్చిన యువకుడు వివరాలు వివరాలు తెలియాల్సి ఉంది.

వంశధారను కప్పేస్తున్న గుర్రపు డెక్క



గొట్టా బ్యారేజ్‌ వద్ద మైదానాన్ని తలపించేలా ఉన్న గుర్రపుడెక్క

ఎల్‌.ఎన్‌.పేట:

వర్షాకాలంలో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షం నీటిని ఒడిసిపట్టి జిల్లాలో లక్షలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది కుటుంబాలకు తాగునీరు అందించే వంశధార నదిని గుర్రపు డెక్క కప్పేస్తోంది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల వైఫల్యం కారణంగా వంశధార మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదనీటితో పాటు గుర్రపుడెక్క భారీగా వచ్చి చేరడంతో గొట్టాబ్యారేజ్‌ వద్ద పచ్చటి మైదానంలా కనిపిస్తుంది. వంశధార నది గొట్టా బ్యారేజ్‌ వద్ద ప్రస్తుతం 37 మీటర్ల నీరు నిలిచి ఉంది. అయితే గుర్రపుడెక్క సామర్థ్యం రోజురోజుకు పెరిగిపోతుండటంతో నీటి నిల్వకు ఇబ్బందిగా మారుతోంది. పాలకులు, అధికారులు స్పందించి గొట్టా బ్యారేజీ వద్ద గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

EDUCATION
■ ఆంధ్రా యూనివర్శిటీలో డిస్టెన్స్‌ కోర్సుల కొరకు డే & నైట్‌ జంక్షన్‌, శ్రీకాకుళంలో శ్రీ శివాని డిగ్రీ కళాశాల నందు సంప్రదించగలరు. ఫోన్‌: 99893 64332, 85009 60827. కోర్సులు: B.A., B.Com, B.Sc., B.Lisc., BBA, M.A, M.Com, M.Sc., MBA, MCA, M.Lisc. [V- 2700]

PLOT FOR SALE
■ దసరా 5 డేస్‌ ఆఫర్‌ 3 లక్షలకే విశాఖపట్నం మున్సిపాలిటీ వార్డు పరిధిలో వెంటనే ఇల్లు కట్టుకునేలా ఇంటిస్థలం, EMI కలదు. సంప్ర : 73864 14017, 70936 32399 [V- 786943]

WANTED
■ ప్రముఖ కంపెనీలో వర్క్‌ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్‌ వాట్సప్‌ చేయగలరు. వర్క్‌ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185474]
■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్‌ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD.7995365999 [HA-98715]
■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024, 9640400073 [H-796284]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.